క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ క్లబ్ అధ్యక్షులు లలిత, సభ్యులు డా.వినీత, డా.కౌశిక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో విశ్వనారాయణ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ మొక్కలు, కొండలు అంతరించి పోవడం వలన పర్యావరణం కలుషితమవుతుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటిన విద్యార్థులకు క్లబ్ తరపున సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లక్ష్మీదేవమ్మ, బసవరాజ్ ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లీఫ్, వెంకటరమణా రెడ్డి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి శాంతికళ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఓ నర్సింగ్ హోం లో వారం క్రితం ప్రసవం కోసం వచ్చిన మంత్రాలయం మండలం సూగురుకు చెందిన లింగమ్మ అనే గర్భిణి మృతి చెందడంపై శుక్రవారం జిల్లా వైద్యాధికారిణి శాంతికళ విచారణ చేపట్టారు. నర్సింగ్ హోమ్‌కు వెళ్లి గర్భిణికి అందించిన వైద్యంపై సంబంధిత డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే నర్సింగ్ హోంలో డెలివరి గది, స్కానింగ్ గదులను పరిశీలించారు. అలాగే సంజీవయ్య నగర్‌లో అగ్నిప్రమాదానికి గురైన అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి.. ప్రమాదానికి కారణాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవాణి, ఇతర దాక్టర్లు ఉన్నారు.

గ్రావెల్ వేయండి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాళ్ నుంచి జీ హోస్లళ్లి రోడ్డులో గ్రావెల్ వేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న కోరారు. శుక్రవారం రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ రోడ్డును బాగు చేయండి అంటూ రోడ్డులో గత వారం నాట్లు వేసి నిరసన తెలుపడంతో స్పందించిన అధికారులు అక్కడక్కడ గ్రావెల్ వేశారన్నారు. అయితే గుంతలు ఉన్న చోట్ల అంతా వేస్తేనే కనీసం ద్విచక్ర వాహనాలు, మనుషులు తిరగడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద ఖాసీం, శంకర్, చందాసాబ్, బందెనవాజ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ఎం. ఎం కీరవాణి



స్థానికులతో మాట్లాడుతున్న కీరవాణి

కౌతాళం: మండల పరిధిలోని మేళిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామిని శుక్రవారం సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి కుటుంబ సభ్యులతో తరలివచ్చి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేపట్టారు. మూడు దశబ్దాల క్రితం రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్దనే ఆయన సంగీత సాధన చేశారు. ఇక్కడ ఉన్న చాల మంది ఆయనకు సుపరిచితులే. కీరవాణి రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే సొంత నిధులతో ఆంజినేయస్వామి ఆలయం నిర్మించారు. అనుకూల సమయాలలో కీరవాణి ఇక్కడి వస్తూ స్వామి సన్నిధిలో పూజలు చేపడుతారు. స్థానిక రైతులు, ప్రజలతో కొద్ది సేపు గడిపారు.

ఉల్లి ధరలపై స్పష్టత లేదు

ఎమ్మిగనూరుటౌన్: ఉల్లి ధరలపై కూటమి ప్రభుత్వానికే తగిన స్పష్టత లేదని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, రైతు సంఘ నాయకులు అబ్దుల్లా, సీఐటీయూ నాయకుడు నాగరాజు ఆరోపించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉల్లికొనుగోలు కేంద్రంలో విక్రయానికి తెచ్చిన ఉల్లిని వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి విక్రయానికి తెచ్చిన రైతులకు ధరపై ఎలాంటి సమాచారం లేదన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా కమీషన్ ఏజెంట్లు టెండర్ల ద్వారా ఉల్లిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు.

గంజాయి పట్టివేత

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్లు గ్రామంలో గంజాయి సాగుచేస్తున్న గ్రామానికి చెందిన వెంకటేష్‌ను పోలీసులు, వ్యవసాయ అధికారుల సాయంతో అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నల్లప్ప శుక్రవారం విలేకరులకు తెలిపారు. పక్కా సమాచారం మేరకు వెంకటేష్ పొలంలో గంజాయి మొక్కలను పరిశీలించారు. వాటిని పీకి తూకం వేయగా 3,450 గ్రాములు ఉన్నట్లు గుర్తించి, కేసు నమోదు చేశామన్నారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్, ఏఎ సుధాకర్ ఉన్నారు.

శిథిలబడి!

- ప్రమాదకరంగా నందవరం ఆది ఆంధ్ర పాఠశాల
- పెచ్చులుడుతున్న పైకప్పు
- వర్షం పడితే గదులోకి నీరు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



పాతబడిన పాఠశాల



నందవరంలోని ఆది ఆంధ్ర స్కూల్‌లో పెచ్చులుడుతున్న పైకప్పు



పాఠశాలలోని వరండాలో పెచ్చులుడిన దృశ్యం

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు– నేడు కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, అదనపు తరగతుల నిర్మాణాలకు నిధులు ఇవ్వకుండా అడ్డుకట్ట వేసింది. మరో వైపు ప్రమాదకరంగా పాఠశాలలను మరమ్మతులు చేయకపోవడంతో శిథిలమైన గదుల్లో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఆది ఆంధ్ర స్కూల్ శిథిలబడింది. పాఠశాల పైకప్పు పెచ్చులుడిడుతోంది. వర్షం వస్తే తరగదులలో నీరు చేరుతోంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం వస్తే కారుతున్న పైకప్పు

పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 175 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. పాఠశాలలో ఆరు తరగతి గదులు ఉన్నాయి. అందుల్లో మూడు గదులు వర్షం వస్తే పై నుంచి నీరు కారుతోంది. రెండు వరండాల్లో పైకప్పులు పెచ్చులుడి పడుతోంది. విద్యార్థులు మధ్యాహ్న భోజనం వరండాలోనే భోజనం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పెచ్చులుడి పడితే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాఠశాల నీటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నాతాధికారులకు విన్నవించామని హెచ్ఎం రామలింగమ్మ చెబుతున్నారు. ఇప్పటికైనా పాఠశాలలో వరండ, పైకప్పులు, గదులలో వర్షం నీరు రాకుండా మరమ్మత్తులు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదోనికి తరలివెళ్లిన నాయకులు



కౌతాళం నుంచి బైకు ర్యాలీగా ఆదోనికి తరలివెళుతున్న దృశ్యం

కౌతాళం: ఆదోని మెడికల్ కాలేజ్ ప్రవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కౌతాళం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల్లో వందలాదిగా తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ జిల్లా కాబోతున్న ఆదోనిలో మెడికల్ కాలేజీ ఒక వరంలాంటిదని, దానిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తే ఇక్కడి పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ విషయాన్ని గ్రహించి అప్పటి ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అలాగే మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇతర నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఆదోనిలో మెడికల్ కాలేజీ కట్టాలని కోరడంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీ నిర్మాణం ప్రారంభించి సూమారుగా 60శాతం పనులను పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధం కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, యువజన మండల అధ్యక్షుడు తాహెర్‌వలి, నాయకులు బాషా, అంజి, రామాంజినేయులు, ప్రహ్లాదరెడ్డి, నాగరాజు, వెంకటరామరాజు, వడ్డెరాము తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఆదోని రూరల్: రైతులు పండించిన ఉల్లి, టమాట, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆదోని నియోజకవర్గ కార్యదర్శి బసాపురం గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండంలోని 104 బసాపురం గ్రామంలో రైతులతో మమేకమై కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యిందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. ఈనెల 20న ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, పెరవలి గ్రామంలో పంటల పరిశీలన జీపుజాతాను ప్రారంభిస్తారన్నారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు గుడిసె ఈరన్న, రైతులు ప్రకాష్‌రెడ్డి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

వెంబడించి రూ.7 లక్షలు అపహరణ

ఆదోని అర్బన్: పట్టణంలో రైతుల వెంట ఇద్దరు దొంగలు రహస్యంగా వెంటపడి బైకు ఆపిన వెంటనే వారి బ్యాంకులో నుంచి రూ.7 లక్షలను అపహరించుకొని పరారైన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామానికి చెందిన రైతులు మహేష్, శివప్ప శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకుకు వచ్చారు. అందులో మహేష్ తన ఆరు ఎకరాలపై బ్యాంకులో రూ.15 లక్షలు రుణం తీసుకున్నాడు. ఫర్టిలైజర్ దుకాణానికి కట్టేందుకు ఉందులో నుంచి రూ.7 లక్షలు డ్రా చేసుకున్నాడు. బ్యాంకు బయటకు వచ్చి ఇద్దరూ కలిసి బైకుకు ఆయిల్ మార్పిద్దామని విక్టోరియాపేటలో ఉన్న మెకానిక్ షాపు వద్దకు వెళ్లారు. బైకును వదిలి మెకానిక్‌తో మాట్లాడి తిరిగి చూసిన వెంటనే బ్యాగు కనిపించకపోవడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే అక్కడున్న సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. బ్యాంకు నుంచి ముగ్గురు వ్యక్తులు రెండు బైకులపై తమ వెంటే వచ్చినట్లు సీసీ కెమెరాలో కనిపించింది. అందులో ఒకరు బ్యాగును తీసుకుని పరిగెత్తి బైకుపై వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు.

22 నుంచి లేఅవుట్ల క్రమబద్ధీకరణ మేళా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అనధికార లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు గాను ఈనెల 22 నుంచి ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో 120పైగా అనధికార లేఅవుట్లు వున్నట్లు తెలిపారు. వాటి క్రమబద్ధీకరణకై 22వ తేదీన ఉదయం 10.30గంటలకు శిల్పాకాలనీ, అన్నమయ్య సర్కిల్, 23న లక్ష్మణ్ టాకీస్ ఏరియా, రిలయన్స్ ట్రెండ్స్ ప్రాంతం, 24న ఎద్దుల మార్కెట్ ఏరియా, కర్నూలు రోడ్డు ప్రాంతం, 25న గూడూరు రోడ్డు, మంత్రాలయం రోడ్డు ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్ క్రమబద్ధీకరణకు టౌన్‌ప్లానింగ్ ,సచివాలయ సిబ్బందితో ఎల్ఆర్ఎస్ అవగాన కల్పించనున్నట్లు తెలిపారు.

మొక్కలు పెంచి పరిరక్షించాలి

పట్టణంలో ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి వాటిని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. పట్టణంలోని కలుగొట్ల రోడ్డుల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది, ప్రజలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆదోనిని జిల్లా చేయాలి

ఆదోని రూరల్: ఆదోని ప్రాంతాన్ని వెంటనే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదోని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అనంత మంగళ ఆంజనేయస్వామి ఆలయం వద్ద కన్వీనర్ పి.కోదండ, కో కన్వీనర్ వాల్మీకి దస్తగిరినాయుడు అధ్యక్షతన ప్రజా, విద్యార్థి సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ప్రచారం నిర్వహించారు. హమాలీ సంఘం నాయకులు గుంటప్పగారి సోదరులు కాశన్న చేతులమీదుగా కరపత్రాలను విడుదల చేశారు.

వందపడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని జైభీమ్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జీ హనుమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం జైభీమ్ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి, ఎంపీడీఓ నూర్జహాన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఎంఆర్‌పీఎస్ నాయకులు అనిల్‌కుమార్, మారెన్న, గోపాల్, సంఘటి యోహాన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్‌సెంటర్‌ను వినియోగంలోకి తేవాలి

ఎమ్మిగనూరుటౌన్: షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన పట్టణంలోని సంజీవ్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సత్వరం పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చి వైద్య చికిత్సలు పునః ప్రారంభించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు వీరేష్, విజయేంద్ర, పంపన్న గౌడ్‌లు డిమాండ్ చేశారు. సంజీవ్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైన అర్బన్ హెల్త్ సెంటర్‌ను వారు పరిశీలించారు.

తడిపొడి చెత్తను వేరు చేయాలి

ఆదోని టౌన్: ప్రజలు ఇళ్లలోని తడి పడి చెత్తను వేర్వేరుగా డస్ట్‌బిన్లలో వేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విషపురుగుల సంచారం

- మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈఓ శామ్యూల్ పాల్
- సిబ్బందిపై ఆగ్రహం



పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను పరిశీలిస్తున్న డీఈఓ

సాక్షి ఎఫెక్ట్

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం, అ జాగ్రత్తతోనే పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని డీఈఓ శామ్యూల్ పాల్ గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌లో విషపురుగుల సంచారంపై 'మోడల్ స్కూల్‌లో భయం భయం ' అనే శీర్షిక శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీఈఓ, జిల్లా మోడల్ స్కూల్ కన్వీనర్ ఈరన్న రెడ్డి శుక్రవారం వేరువేరుగా పాఠశాలను తనిఖీ చేశారు. ఉదయం పాఠశాలకు వచ్చిన కన్వీనర్ ఈరన్న రెడ్డి పాఠశాలలోని సిబ్బందిని విచారణ చేశారు. పాఠశాల గదులలో పాములు, తేళ్లు తిరుగుతున్నట్లు విచారణలో తెలింది. అలాగే ఒక గదిలో గబ్బిలాలు ఉన్నట్లు గుర్తించి ఫొటోలు తీసుకున్నారు.

అపరిశుభ్రత వల్లే అనర్థాలు..

మధ్యాహ్నం డీఈఓ శామ్యూల్ పాల్, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠలతో కలిసి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. విష పురుగు కాటుకు గురైన కృష్ణవేణితో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ పాఠశాల చుట్టూ ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు, మంచినీటి కుళాయిలను పరిశీలించారు. పాఠశాల చుట్టూ ఇలా అపరిశుభ్రంగా ఉండడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని, వాటికి అయ్యే ఖర్చును బిల్లు రూపంలో ఇవ్వాలని ఆ నిధులను కూడా వెంటనే విడుదల చేస్తామన్నారు. పనులు త్వరితగతిన చేపట్టాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను పాఠశాల చైర్మన్ గౌస్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో తాగు నీటి సమస్య లేకుండా కుళాయిల మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్ల తనిఖీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రవీంద్ర భారతి, ముబారక్, శ్రీరామ తదితర ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్లను డీఈఓ శ్యామ్యూల్ పాల్ తనిఖీ చేశారు.. ప్రైవేట్ పాఠశాలలు అదనపు తరగతి గదులకు అనుమతులు తీసుకొని నిర్వహించాలని ఆయా పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. సౌండ్ పొల్యూషన్, ఫైర్ సర్టిఫికెట్, మున్సిపల్ అనుమతులు తప్పని సరి అన్నారు. అనంతరం నవోదయ, గురుకుల, సైనిక్ కోచింగ్ సెంటర్లను 20 మంది పలు శాఖల అధికారులతో తనిఖీ చేసి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా పాఠశాలలు, కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, శేఖర్, కృష్ణ, రఘు, అఫ్రిదీ తదితరులు డీఈఓకు వినతి పత్రం ఇచ్చారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసే కుట్ర



పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆదోని మెడికల్ కళాశాలకు బుట్టా రేణుక ఆధ్వర్యంలో తరలిన పార్టీ శ్రేణులు



పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసం నుంచి ఆదోనికి పోస్టర్లతో బయలు దేరుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- పట్టణం నుంచి భారీగా ఆదోని మెడికల్ కాలేజ్‌కు తరలిన పార్టీ శ్రేణులు, విద్యార్థులు, యువత

ఎమ్మిగనూరుటౌన్: పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే..కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్యను దూరం చేసి వాటిని ప్రైవేట్‌కు అప్పగించేందుకు కుట్ర పన్నతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆరోపించారు. శుక్రవారం చలో మెడికల్ కళాశాల కార్యక్రమంలో భాగంగా పార్టీ యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, నీలకంఠల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థులు ఆదోనికి తరలివెళ్లారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మాణానికి జగనన్న శ్రీకారం చుట్టగా.. అందులో 7 కళాశాలల నిర్మాణాలు పూరయ్యాయన్నారు. మిగిలినవి ఎన్నికల కారణంగా పలు దశల్లో నిలిచిపోయాయన్నారు. పూర్తయిన వాటితో పాటు మిగిలిన కళాశాలలను కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు కుట్ర పన్నడం ఘోరమన్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు,వైస్ చైర్మన్లు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకోట ఆధ్వర్యంలో

చలో ఆదోని మెడికల్ కళాశాల కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, యూత్ నాయకుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసం నుంచి పార్టీ శ్రేణులు, యువతతో భారీగా మెడికల్ కళాశాలకు తరలివెళ్లారు. ఎంపీపీ కేశన్న, పార్టీ నాయకులు భీమిరెడ్డి, రియాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదుట ఏఐటీయూసీ నాయకులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, అధ్యక్షులు వై.టి.భీమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆదోని శివారులోని ఆరేకల్ వద్ద నిర్మాణం మధ్యలో ఆగిపోయిన ప్రభుత్వ వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నష్టాల పేరుతో నిర్మించలేదన్నారు. ఇప్పుడు దానిని ప్రైవేట్‌పరం చేసేందుకు పూను కుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హుసేని, షేక్షావలి, హమాలీ సంఘం నాయకులు నరసింహులు, నాగరాజు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ వద్ద నిర్మించిన టిడ్కో గృహాలకు మంచినీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టిడ్కో గృహాలను వద్ద లబ్ధిదారులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కొందరు ఆయా గృహాల్లో నివాసం వున్నారని వారికి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నివాళి

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామ వైఎస్సార్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్ మాతృమూర్తి జంబు పార్వతమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డిలు గ్రామానికి చెరుకుని జంబు పార్వతమ్మ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నందవరం : పాడిరైతులు పశువులలో సంక్రమించే సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో పశుసంవర్ధ శాఖ, మానవజాతి ఫార్మా ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ క్యాంప్ చేపట్టారు. అలాగే ఎద్దులు, ఆవులు, గేదెలు గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధ శాఖ సహాయకులు మల్లికార్జున, వంశీ, శ్రీదేవి, సంధ్య, నల్లారెడ్డి పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్/మంత్రాలయం రూరల్ : విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం సత్వరం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్ ఖాదర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు వైఎస్ఆర్ సర్కిల్‌లో, మంత్రాలయంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టారు. నాయకులు దస్తగిరి,సమీర్, రవి, సురేష్, అరుణాచారి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మైదానంలో నవరాత్రి ఉత్సవాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ మైదానంలో శ్రీ విద్యభిన్వ సుబ్రహ్మణ్యభారతి స్వామి, శ్రీ రాజయోగి పంచలింగేశ్వరస్వామి వారి చేతుల మీదుగా నవరాత్రి ఉత్సవాలకు భూమిపూజచేసి ఏర్పాట్లను ప్రారంభించారు. ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మాల హుసేనప్ప శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వెంటనే పార్టీ నాయకులను గ్రామానికి పంపించి బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందేలా చూశారు. కర్నూలు జిల్లా వైఎస్సార్సీపీ యూత్ కార్యదర్శి బి.పి.కరియప్ప బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య విజయమ్మకు నగదు అందించారు.

విద్యార్థులపై కేసుల నమోదు దారుణం

ఆదోని రూరల్: ఆదోని మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై, ఇద్దరు మహిళా లెక్చరర్లపై పోలీసులు కేసులు నమోదు చేయడం దారుణమని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.జి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల నిరసనలను అణిచివేయడం తగదన్నారు. వెంటనే పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ఎఫ్ కర్నూలు బాధ్యులు తస్లీమా, ఖాదర్‌బాషా, ఫరూక్ పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గం

కోసిగి: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గమని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రాజు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి యత్నిస్తోందన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి



డీఎస్పీగా పదోన్నతి పొందిన మధుసూదన్‌రావును సన్మానిస్తున్న డీఎస్పీ భార్గవి, సీఐలు

ఎమ్మిగనూరురూరల్: పోలీసులు తమ విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని డీఎస్పీ ఎం.ఎన్. భార్గవి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ అవరణలో రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ డీఎస్పీగా పదోన్నతిపై వెళ్లిన బీవీ.మధుసూదన్‌రావును ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు సర్వసాధారణమని అయితే పనిచేసి చోట విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీ నివాసులు, రామాంజులు, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, కేశవ్, హనుమంత రెడ్డి, విజయకుమార్, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి వాసికి కర్ణాటకలో అవార్డు



అవార్డుతో డాక్టర్ శివానంద లహరి

కోసిగి: మండల కేంద్రంలోని జేబీఎం ప్రాథమిక హెచ్ఎం రాజమౌళి, శైలజ దంపతుల కుమార్తె డాక్టర్ శివానంద లహరికి కర్ణాటకలో ఉత్తమ ప్రొఫెసర్ అవార్డును అందుకున్నారు. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో బీఏ ఎంఎస్ (ఎండీ ఇన్ ఆయుర్వేదిక్) కోర్సు పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం రాయచూర్ జిల్లాలోని లింగసూగూరు మెడికల్ కళాశాలలో ఆయూర్వేదిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 17న లింగసూగూరులోని శ్రీ సంజీవ్ పాలటెక్నిక్ కళాశాలలో జరిగిన తాలుకా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆమెకు ఉత్తమ ప్రొఫెసర్‌గా అవార్డు అందజేశారు.

సహకార సంఘాల్లో రైతులకు రుణాలు

పెద్దకడబూరు : దీర్ఘకాలిక, క్రాప్‌లోన్లు కావాల్సిన రైతులు స్థానిక సహకార పరపతి సంఘంలో సంప్రదించాలని సింగిల్‌విండో అధ్యక్షుడు మీసేవ ఆంజనేయ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో సంఘం ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రుణాలు రూ. కోటి, క్రాప్‌లోన్లు కింద రూ. 10లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com